

# మళ్ళీ నాటకం రాస్తున్నాను

కస్తూరి మురళీకృష్ణ

**అతడి నడక చూడగానే నా నాటకంలో పాత్రకి అతడు సరిపోతాడని అనిపించింది.**

**'అతడి పేరేంటి?' పక్కనే ఉన్న కొలీగుని అడిగాను.**

**'ప్రసాదరావు. పిచ్చివాడు. ఎవరూ అతడి జోలికి పోరు' చెప్పాడు.**

**నేను మళ్ళీ అతడిని పరిశీలనగా చూశాను. అతడెవరితోనో నవ్వుతూ మాట్లాడుతున్నాడు.**

**'ఇతడే నా పాత్రకు తగ్గవాడు' నిశ్చయించుకున్నాను.**

**'నన్ను ప్రసాదరావుకు పరిచయం చేస్తావా?' అడిగాను కొలీగుని.**

'నీ ఇష్టం. కొరివితో తలగోక్కుంటానంటే నేనేం చేస్తాను?' అన్నాడు. కానీ వెంటనే 'ప్రసాద్- హే ప్రసాద్' పిలిచాడు.

ప్రసాద్ నవ్వుతూ వచ్చాడు.

మా ఇద్దరినీ ఒకరికొకరికి పరిచయం చేశాడు కొలీగు.

కరస్పర్శ పని పూర్తికాగానే, ఉపోద్ఘాతాల్లాంటివి లేకుండా సూటిగా అడిగాను.

'నేనో నాటకం రాశాను. దాన్లో ప్రధాన పాత్రకు మీరు సరిపోతారనిపించింది. నా నాటకంలో పాత్ర వేస్తారా?'

అతను నావైపు విచిత్రంగా చూశాడు. ఆ వెంటనే అతని కళ్లల్లో విషాదం కదలాడింది.

'ఇరవయ్యేళ్ల క్రితం అన్నీ వదిలేశాను. ఆరోజులు... ఆ మనుషులు... ఆ రచయితలు... ఆ నటులు'

నా పక్కన ఉన్న కొలీగు నవ్వకపోతే అతను చెప్తున్నది నిజం అనుకునేవాడిని. అంత అద్భుతంగా చెప్పాడు.

నేనేమన్నా అనేలోగా మళ్లీ తనే అన్నాడు 'నా జీవితం ఒక దురదృష్ట ప్రహేళిక. పుట్టగానే తండ్రిని కోల్పోయాను. ఊహ తెలిసేసరికి తల్లి పోయింది. నా అనేవాళ్లు లేరు. నా అన్నవాళ్లు లేరు' చెప్తూ పోయాడో దయనీయగాథ. క్షణంలో అతని కళ్లల్లో నీళ్లు తిరిగాయి. నిజంగా ఏడవటం మొదలుపెట్టాడు. నా మొహంలోకి చూసి పెద్దగా నవ్వాడు. నాకు అద్భుతం అనిపించింది. క్షణక్షణానికి ఊసరవెల్లిగా హావభావ ప్రకటన మారుస్తూ ప్రదర్శించగల వ్యక్తి తనలోని కళను ఇలా వ్యర్థ చేయటం నేరం అనిపించింది. అదే చెప్పాను. 'నా కిప్పుడు పూర్తిగా నమ్మకం కుదిరింది. ఆ రోల్‌కి మీరు తప్పించి ఇంక ఎవరూ సరిపోరు' నొక్కి చెప్పాను.

కళ్లెగరేశాడు. 'రేపు కలవండి. ఆలోచించి చెప్తాను'

నేను స్క్రిప్టు ఇవ్వబోయాను. తీసుకోలేదు. 'రేపు కలవమన్నాగా' అని వెళ్లిపోయాడు. ఒక్క క్షణం ఒళ్లు మండిపోయింది. ఏదో గొప్ప నటుడిలా ఆ ఫోజేమిటి అనిపించింది. కానీ నాకు గత్యంతరంలేదు.

సాధారణంగా ఒక వయసు వచ్చేసరికి ప్రభుత్వోద్యోగులందరి మనస్థితి ఒక రకంగా తయారవుతుంది. ఇక జీవితంలో పైకి వెళ్లలేమని, రిటైర్మెంట్ తప్ప సాధించేదేమీలేదని అర్థమైపోతుంది. ఆ వెంటనే తనలో ఉన్నశక్తికి తగిన న్యాయం తాను చేయలేకపోతున్నాడన్నదీ గ్రహింపుకు వస్తుంది. అయితే మనిషి ఓటమికి తనే కారణం అని ఎప్పుడూ ఒప్పుకోడు. దాంతో ఓటమికి పలు కారణాలు చూపుతాడు. ప్రతివాడినీ విమర్శిస్తూ, తనే గొప్ప అని భావిస్తూ అదోరకమైన ఆత్మవంచనలో ఆనందం పొందుతాడు. ఇటువంటి వాళ్లలోంచి నాటకం వేసేందుకు నటుల్ని వెతుక్కోవటం అంటే ఆకాశంలో తారల్ని అందుకోవటం వంటిదే. ప్రతివాడికీ తనో అద్భుతమైన కళాకారుడు అని నమ్మకం. కానీ వేషం వేయాలంటే అడ్డొస్తుంది అహం. దాని వెనుక నక్కి ఉంటుంది పరాజయ భయం.

నా నాటకంలో అది చాలా ప్రధానమైన పాత్ర. ముందొకాయనని అడిగాను. ఆయన స్క్రిప్టు చదివి బాగుందన్నాడు. కానీ 'మార్చాలి' అన్నాడు. 'ఏం మార్చాలి?' అడిగాను. ఏం మార్చాలో ఆయనకే తెలియదు. కానీ మార్చకుండా నేను రాసినట్టు వేస్తే ఆయన గొప్ప ఏముంది? ఇంకో సీనియర్ (అంటే ఇప్పుడు వేషాలు వేయని) నటుడికి నా దర్శకత్వంలో వేసేందుకు అహం అడ్డొచ్చింది. దాంతో అసలు నాటకం ఎందుకు రాశానా? అన్న బాధ మొదలయింది. ఈదశలో ప్రసాద్ కలిశాడు.

ఏదైనా వస్తువులేదని తెలిస్తే ఉన్నదాంట్లో సంతృప్తిపడిపోతాం. కానీ అది 'ఉంది' అని తెలిస్తే దాన్ని పొందకపోతే బాధపడతాం. అందుకే నా అహాన్ని అణచుకుని ప్రసాద్‌ని మరుసటిరోజు కలిశాను.

నన్ను గుర్తుపట్టలేదు. అది నటన అనిపించింది. నన్ను నేను పరిచయం చేసుకున్నాను. స్క్రిప్టు ఇచ్చాను. దానివైపు కూడా చూడలేదు ప్రసాద్. 'నేను కొన్నేళ్లుగా వైకుంఠం ట్రూపులో వేస్తున్నాను. ఒకవేళ వైకుంఠం అనుమతిస్తే మీ నాటిక సంగతి చూస్తాను' అన్నాడు. 'సరే'నని వచ్చేశాను.

కానీ వారమైనా ప్రసాద్ ఏమీ చెప్పలేదు. నేను ఆ పాత్రకి వేరే వారిని ఊహించలేకుండా ఉన్నాను. అదీగాక నాటిక వేయాలని అనుకుంటున్నామని తెలిసినప్పటి నుంచీ ప్రోత్సాహపూరిత వాక్యాలకన్నా వ్యంగ్య బాణాలు, విసుర్లు ఎక్కువయ్యాయి. అదీ ఒకప్పటి కళాకారులు, ఇపుడు నటిస్తున్న కళాకారుల దగ్గర నుంచి కావటం బాధగా అనిపించింది. ఒకతోటలో ఒక చెట్టు పూలు పూస్తోందంటే తోట మొత్తం సంబరపడుతుంది. పశు, పక్షులు, తేనెటీగలు ఆనందిస్తాయి. ఒక కళాకారుడు కళారంగంలో అడుగుపెడుతున్నాడంటే తోటి కళాకారులు ఎందుకు భయపడతారు? ఎందుకతడి మార్గంలో అడ్డంకులుంచాలని ప్రయత్నిస్తారు?

ఒకతోటలో ఒక చెట్టు పూలు పూస్తోందంటే తోట మొత్తం సంబరపడుతుంది. పశు, పక్షులు, తేనెటీగలు ఆనందిస్తాయి. ఒక కళాకారుడు కళారంగంలో అడుగుపెడుతున్నాడంటే తోటి కళాకారులు ఎందుకు భయ పడతారు? ఎందుకతడి మార్గంలో అడ్డంకులుంచాలని ప్రయత్నిస్తారు?

ఆరోజు నాటిక పోటీలకు దరఖాస్తు ఇవ్వాల్సిన చివరి రోజు. నేను ఆశ వదిలేసుకున్నాను. ప్రసాద్ నన్ను వెతుక్కుంటూ వచ్చాడు.

'మళ్లీ రాలేదేం?' అడిగాడు.

నేను నవ్వి ఊరుకున్నాను.

'అప్లికేషన్ ఇచ్చెయ్యండి. నేను మీ నాటకంలో వేస్తున్నాను' అని మరోమాటకు ఆధారం లేకుండా వెళ్లిపోయాడు.

కాస్సేపటి దాకా అతను అన్న మాటలు నాకు అర్థంకాలేదు. అర్థమయిన వెంటనే అప్లికేషన్ అందచేసి వచ్చాను. మిగతా నటులందరికీ రిహార్సలు సమయం చెప్పి, స్క్రిప్టు కాపీలు ఇచ్చాను.

రిహార్సల్లు ఆరంభమయ్యాయి.

మిగతావాళ్లు ఆలస్యంగా వచ్చేవారు. ఒకోసారి వచ్చేవాళ్లు కాదు. డైలాగులు మరచిపోయేవారు. సరిగ్గా పలికేవారు కారు. ఒకోసారి భావం పలికితే నటన దెబ్బతినేది. నటిస్తే డైలాగు మరచిపోయేవాళ్లు.

కానీ ప్రసాద్ మొదటిరోజు నుంచీ ఒక్కక్షణం కూడా ఆలస్యంగా రావటం అటుంచి, తాను ప్రసాద్ కాదు, ఆ పాత్రే తాను అన్నట్టు భావించటం కనిపించింది. అతను నటిస్తుంటే మిగతా నటులు తమతమ సంభాషణలు మరచి అతని నటనలో లీనమైపోయేవారు. నాకెంతో ఆనందంగా, అద్భుతంగా అనిపించేది. రిహార్సల్స్ అయిపోయిన మరుక్షణం మామూలుగా, మౌనంగా వెళ్లిపోయేవాడు.

కానీ ప్రసాద్ నా నాటికలో వేస్తున్నాడని తెలిసినప్పటి నుంచీ అందరూ నన్ను హేళన చేయటం ఆరంభించారు. 'కుక్కతోక పట్టుకుని గోదావరి ఈదుతున్నాడు' అని వ్యంగ్యంగా నవ్వేవాళ్లు.

ఈలోగా నాకు ప్రసాద్ గురించి కొన్ని సంగతులు తెలిశాయి. ఒకప్పుడు ప్రసాద్ నాటకాలు బాగానే వేసేవాడట. కానీ కొన్నాళ్ల తరువాత అతనికి సరైన పాత్రలు ఇవ్వటం మానేశారట. ఇచ్చిన పాత్రనైనా అతను బాగా చేయగానే, మరుసటి ప్రదర్శనకు అతని రోలు మార్చేసేవారట. ఏమైనా అంటే 'నువ్వేరోలయినా చేయగలవోయ్' అని సర్దిచెప్పేవారట. కానీ కొన్నేళ్లకి కుట్రలు, కుతంత్రాలు వెనుక తన ప్రతిభను పైకి రానివ్వకూడదన్న భావన ఉందని ప్రసాద్ గ్రహింపుకు వచ్చింది. అతని నటనపై విమర్శల్లో ఎక్కడ పొగిడితే అతను గొప్పగా భావించుకుంటాడో అన్న భయమే ఎక్కువగా కనిపించటం పట్ల అతని మనస్సు విరిగిపోయింది. అందుకే సీరియస్‌గా నటించటం మానుకున్నాడట. నా ఫ్రెండు చెప్పాడు.

ఒరోజు ప్రసాద్‌ని ఇదే విషయం 'నిజమా' అనడిగాను.

నవ్వాడు. 'రోజూ సూర్యోదయం అవుతుంది. రోజూ సూర్యాస్తమయం అవుతుంది. అద్భుతమైన దృశ్యాలవి. మనం చూడకపోతే వాటికేమైనా నష్టమా?' అన్నాడు.

నేనేదో వాదించబోయాను.

'మీ నాటకం నాకు నచ్చింది. బాగా రాశారు. ఆ గౌరవం నిలుపుకోవాలంటే మరోమాట అనవసరంగా మాట్లాడకండి' అని వెళ్లిపోయాడు.

నాకు అప్పుడు అనిపించింది. ఇతడికి మనుషుల వల్ల చాలా లోతుగా గాయం తగిలింది. అందుకే ఎదుటివారు తనని ఏదైనా అనేలోగా ఈయనే తన మాటలతో వాళ్లని దూరం తరిమేస్తున్నాడు. ఎందుకంటే రిహార్సల్ సమయంలో నేనేమన్నా సూచనలిచ్చినా, సలహాలిచ్చినా తప్పనిసరిగా అమలుపరిచేవాడు. లేకపోతే దాన్ని ఎందుకు పాటించటంలేదో వివరించేవాడు. కానీ ఆ తరువాత ఆయనెవరో, నేనెవరో!

స్క్రూటినీలో మా నాటికను చూసినవారంతా మెచ్చుకున్నారు.

బయటకు వస్తూంటే అన్నాను ప్రసాద్‌తో 'మీకు ఉత్తమ నటుడి బహుమతి ఖాయం'.

ప్రసాద్ నవ్వాడు. 'రాదు' అన్నాడు క్లుప్తంగా.

మరో నటుడన్నాడు. 'మిగతా స్క్రిప్టులు చూశాను. ఏమీ బాగాలేవు. మనదే బాగుంది. అవార్డు తప్పకుండా వస్తుంది'

ప్రసాద్ నవ్వి 'రాదు' అన్నాడు.

'ఎందుకని?' అడిగాను.

'రాదంతే. మీకిది మొదటి నాటిక. మొదటి ప్రదర్శన' అన్నాడు.

ఎంత రెట్టించినా ఇంక ఏమీ చెప్పలేదు.

కానీ నాకు మాత్రం మా నాటికకు బహుమతి వస్తుందని నమ్మకంగా ఉంది.

రెట్టించిన ఉత్సాహంతో అందరం రిహార్సల్స్ ముమ్మరం చేశాం.

ప్రదర్శన రోజు దగ్గర పడుతున్నకొద్దీ ఉద్విగ్నత అధికం కాసాగింది. కానీ ప్రసాద్ విషయమే నాకు ఆశ్చర్యం కలిగిస్తూండేది. ప్రతి రిహార్సల్‌లో కొత్తదనం ప్రదర్శించేవాడు. ప్రతిసారి ఇంతకుముందుకన్నా 'అద్భుతం' అనిపించేది.

'ఇదెలా సాధ్యం ప్రసాద్?' అడిగాను. ప్రదర్శనరోజు ప్రసాద్ మేకప్ వేసుకుంటుంటే.

'నేను ప్రసాద్‌ను కాదు. ఆ పాత్రని' అన్నాడు క్లుప్తంగా.

'నేను మిగతా నాటికలు చూశాను. మన నాటికే బాగుంటుంది. అవార్డు మనదే' అన్నాను ప్రసాద్‌ని సవాల్ చేస్తూ.

ప్రసాద్ నవ్వి 'గుడ్‌లక్ టు యువర్ హోప్' అని లేచాడు.

ఆ తరువాత జరిగినదంతా కలలోలా జరిగిపోయింది.

ప్రదర్శన ఆరంభమయింది. నేను వింగ్‌లో ఉండి నటులు చెప్పే డైలాగులు సరిచూస్తున్నాను. ఒక అంకం తరువాత మరో అంకం చకచకా సాగిపోతోంది. చూస్తూచూస్తూండగానే నాటిక అయిపోయింది. నాటిక అయిన తరువాత ఏం జరుగుతోందో నాకు అర్థంకాలేదు. హాలు కరతాళ ధ్వనులతో మారుమ్రోగిపోయింది. స్నేహితులు, సన్నిహితులు, పరిచయం ఉన్నవారు, లేనివారు స్టేజిమీదకు పరుగెత్తుకొచ్చేశారు. ప్రసాద్‌ని గాల్లోకి ఎత్తేశారు. ఎంతమంది నా భుజాలు చరిచారో గుర్తులేదు.

ఒక కథ, నవల రాస్తే, అది ప్రచురణ అయి పాఠకులను చేరాలి. వాళ్లు తమ ఆనందాన్ని ఉత్తరం ద్వారానో, ఎప్పుడో కలిసినపుడో వ్యక్తపరుస్తారు. కానీ. ఇది కొత్త అనుభవం! నాటిక పూర్తయిన క్షణంలో తెలిసిపోయింది ఫలితం! నా తల తిరిగిపోయింది. ఒక మత్తులాంటి ఆనందం శరీర నరనరాన వెల్లువలా ప్రవహించింది. అప్పుడర్థమయింది నాకు, ఒక కళాకారుడు ప్రజల మెప్పుకోసం ఎందుకు తపిస్తాడో! ప్రజలు తన కళా ప్రదర్శనను మెచ్చాలని, తన కళకు నీరాజనాలు పట్టాలని ఎందుకు ఆతృతపడతాడో! అలాగే, తన సమయం అయిపోయిందని అర్థమయినా, ఎందుకని తన కళకు దూరంగా ఉండలేడో!

ఒక కథ, నవల రాస్తే,
అది ప్రచురణ అయి
పాఠకులను చేరాలి.
వాళ్లు తమ ఆనందాన్ని
ఉత్తరం ద్వారానో,
ఎప్పుడో కలిసినపుడో
వ్యక్తపరుస్తారు. కానీ,
ఇది కొత్త అనుభవం!
నాటిక పూర్తయిన
క్షణంలో
తెలిసిపోయింది ఫలితం!
నా తల తిరిగిపోయింది.
ఒక మత్తులాంటి
ఆనందం శరీర
నరనరాన వెల్లువలా
ప్రవహించింది.
అప్పుడర్థమయింది
నాకు, ఒక కళాకారుడు
ప్రజల మెప్పుకోసం
ఎందుకు తపిస్తాడో!

ప్రసాద్ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ప్రతివాళ్లు అతడిని కౌగలించుకునేవారే. అతడిని చుట్టుముట్టేశారు. అతడికి ఊపిరి సలపనివ్వటంలేదు.

ఈ ఆనంద ప్రకటన తుఫాను సర్దుమణిగిన తరువాత ప్రసాద్ వైపు చూశాను.

ప్రసాద్ నిర్లిప్తంగా కూచున్నాడు. అభినందించేవాళ్ల అభినందనలు అందుకుంటున్నాడు. నవ్వుతున్నాడు. మళ్లీ మామూలైపోతున్నాడు.

'ఇంకాస్సేపటిలో బహుమతుల ప్రకటన ఆరంభమౌతుంది' అనౌన్స్‌మెంట్ వినిపించింది. నాలో ఉద్విగ్నత పెరిగింది.

కానీ ఇంకా ప్రేక్షకుల అభినందనల మత్తు దిగలేదు. ఆత్మవిశ్వాసం అధికం అయింది.

బహుమతుల ప్రకటన ప్రారంభమయింది.

'ఉత్తమ నాటిక'

సీట్లోంచి సగం లేచిన నాకు వాళ్లు అనౌన్స్ చేసిన శబ్దం సరిగా అర్థంకాలేదు. బహుమతి మా నాటికకు రాలేదు.

నేను కుర్చీలో కూలబడ్డాను. చప్పట్లు కొట్టేందుకు చేతులు కదలలేదు.

'ప్రతిభకల కళాకారులు దొరకటం అరుదు. ఆ ప్రతిభను గుర్తించేవాళ్లు మరీ అరుదు' ప్రసాద్ చెవిలో గుసగుసగా అన్నాడు.



ఒకవంక ప్రేక్షకుల ఆదరణ నరనరాన మత్తులా ప్రవహిస్తూంటే, మరోవంక ఈ నిరాకరణ ఆ మత్తుకు విరుగుడులా పనిచేస్తోంది. మెదడు మొద్దుబారిపోయింది. 'ఇక జన్మలో నాటకాల జోలికి పోను' నిర్ణయించుకున్నాను.

'ఉత్తమ నటుడు'

ప్రసాద్ పేరు కాదు వినిపించింది.

ప్రసాద్ వైపు చూశాను.

చిత్రమైన నవ్వు ఉంది అతని పెదవులపై.

అంతలో మరో మరపురాని సంఘటన జరిగింది.

ఉత్తమ నటుడి పేరు వినగానే ప్రేక్షకులలో హర్షధ్వానాల బదులు విమర్శనాత్మక కేకలు బయలుదేరాయి. కొందరు స్టేజిమీదకు పరుగెత్తుకెళ్లారు.

'ప్రసాద్ ఉత్తమ నటుడు'

'ఉత్తమ నటుడు ప్రసాద్'

ముక్తకంఠంతో ప్రేక్షకులు అరవసాగారు. కార్యక్రమ నిర్వాహకులతో వాదించసాగారు. నేను ప్రసాద్ వైపు ఆనందంగా చూశాను.

ప్రసాద్ ఈ గందరగోళాన్ని నిర్లిప్తంగా చూస్తున్నాడు.

చివరికి నిర్వాహకులు ప్రకటన చేశారు.

'న్యాయనిర్ణేతల నిర్ణయాన్ని మార్చటం కుదరదు కాబట్టి, ప్రసాద్‌కు ప్రత్యేక బహుమతి ఇస్తున్నాం'

హాలు వెంటనే హర్షాతిరేక ధ్వానాలతో నిండిపోయింది.

'నాకు వద్దీ బహుమతి' లో గొంతుకలో అన్నాడు ప్రసాద్.

'వెళ్లు' అభ్యర్థించాను. 'నీకోసం నాకోసం కాదు, ప్రేక్షకులకోసం'

మౌనంగా, కరతాళధ్వనుల మధ్య, స్టేజిమీదకు వెళ్లాడు ప్రసాద్.

అయితే ఆరోజు ఊరు వెళ్లాల్సి ఉండటంతో వెంటనే నేను వెళ్లిపోయాను.

మళ్లీ పదిరోజుల తరువాత ఆఫీసుకు వెళ్లాను.

ఇంకా మా నాటిక గురించి చర్చలు జరుగుతూనే ఉన్నాయి.

నేను ప్రసాద్‌ని కలవాలని వెళ్తుంటే దారిలో ఓ కొలీగ్ కలిశాడు.

'నువ్వు ఆరోజు వెళ్లిపోయావు కానీ తరువాత ప్రసాద్‌కు చాలా తిట్లుపడ్డాయి' చెప్పాడు.

'ఎందుకని?' ఆత్రంగా అడిగాను.

'నాటిక అయిన తరువాత అందరూ తాగుతూ చర్చించుకున్నారు. ప్రసాద్ మిగతావారిని డామినేట్ చేశాడని తిట్టారు. చప్పట్లు పడగానే ఒళ్లుపై మరచిపోయాడని తిట్టారు. మీ నాటికలో డ్రమటిక్ ఎలిమెంట్ లేదట. స్క్రిప్టు బాగోలేదట. ఇలా ఏవేవో అన్నారు. అయినా ఈ నాటిక, ఈ ప్రేక్షకులకన్నా ఎక్కువ స్థాయిదట. ఇక్కడ ప్రదర్శించే నాటిక కాదిది అన్నారు.'

నాకు నవ్వొచ్చింది. నాటిక అయిన తరువాత ప్రేక్షకుల ప్రతిస్పందన తాలూకు మత్తు ఇంకా పూర్తిగా తగ్గలేదు. ఎవరు నిర్ణయించేది ప్రేక్షకుల స్థాయిని? అప్పుడనిపించింది, స్థాయి అంటూ ఉంటే అది కళాకారుడికే. ఉత్తమమయిన దాన్ని దేన్నయినా ప్రేక్షకులు ఆదరిస్తారు. తమ ప్రతిభారాహిత్యాన్ని ప్రేక్షకులపై నెట్టేసి వారి స్థాయిని నిర్ణయించి కళాకారులు ఆత్మవంచన చేసుకుంటున్నారు.

అంతలో మరో ఆలోచన వచ్చింది.

ఇది ప్రసాద్‌ను మానసికంగా దెబ్బతీయటం కాదు కదా? ఒకడు పైకి ఎదుగుతున్నాడంటే, పైకి ఎదగలేని వాడిని చూపి, వాడినీ కిందకు లాగెయ్యటం, ఎదగ వద్దనటం ఏరకంగా సమంజసం? ఈరకంగా ప్రతిభ ఉన్నవాళ్లని అణచివేసి ప్రతిభలేనివారు అందలం ఎక్కుతున్నారు? అందుకేనా మన కళలు ప్రపంచ రంగంలో గుర్తింపును పొందలేకపోతున్నాయి?



ఈ విమర్శ వెనుక కుత్సితాన్ని ప్రసాద్ గమనించాడా? లేక నిజం అనుకుని క్రుంగిపోయాడా?

కొలీగును సగం మాటలో వదలి ప్రసాద్ సెక్షన్‌కు పరుగెత్తాను.

నన్ను చూడగానే నవ్వాడు ప్రసాద్.

'బహుమతి రానందుకు బాధగా ఉంది' అన్నాను కాస్సేపటికి.

**ప్రసాద్‌తో మళ్లీ నాటిక వేయించగలనన్న ఆత్మవిశ్వాసం నాకుంది. ఎందుకంటే నిజమైన కళాకారుడెప్పుడూ తన ప్రతిభను ప్రదర్శించే అవకాశాన్ని వదులుకోడు. అందుకే ప్రసాద్ నా నాటికలో నటించాడు. ప్రసాద్ మళ్లీ నటించాలంటే నేనీసారి క్రితంసారికన్నా అద్భుతంగా రాయాలి. రాయగలనన్న విశ్వాసం నాకుంది. అది చూస్తే ప్రసాద్‌లోని కళాకారుడు కాదనలేడు.**

'విమర్శకుల బహుమతి అవసరంలేదు. నాటిక అయిన మరుక్షణం ప్రేక్షకులిచ్చిన బహుమతి చాలు. అదే అసలు బహుమతి. దాని ముందు మిగతావన్నీ దిగదుడుపే' అన్నాడు.

'వాళ్ల విమర్శలను పట్టించుకోవద్దు' అన్నాను.

'నాకవి అలవాటే. ప్రతిభ ఉన్నవాడిని చూస్తే లేనివాడికెప్పుడూ భయమే'

'అందుకే మనం మళ్లీ నాటకం వేయాలి'

'నేనిక వేయను'

'ఎందుకని?'

'అది అడగకండి. నేనింక స్టేజి ఎక్కను' మొండిగా అన్నాడు ప్రసాద్.

'ఎవరో ఏదో అన్నారని మనం మనకు అన్యాయం చేసుకుంటామా? కళ మనిషికి భగవంతుడిచ్చిన వరం. మనిషి కుత్సితానికి లొంగి భగవంతుడిచ్చిన ప్రతిభను వ్యర్థం చేసుకుంటామా?'

'వీళ్లు వేరేవాడిలో ప్రతిభను గుర్తించలేరు. గుర్తిస్తే భరించలేరు.'

'మీరే అన్నారుగా, ఎవరు చూసినా చూడకున్నా సూర్యాస్తమయ, సూర్యోదయాల సౌందర్యానికి నష్టం లేదని. ఎవరో ఎందుకు గుర్తించాలి. మనం కళను మనం సంతృప్తికోసం ప్రదర్శించాలి.'

'ఏమో నేనిక స్టేజి ఎక్కను'

అప్పుడనిపించింది నాకు. ఇలా ఎంతమంది ప్రతిభావంతులయిన కళాకారులు అనేక కారణాల వల్ల తమలోని ప్రతిభను అణచుకుని అజ్ఞాతంగా ఉండిపోతున్నారో! తెరముందుకు వంద మంది కళా కారులు వస్తే దాన్లో ఒకరో ఇద్దరో అత్యున్నతస్థాయికి చేరుకుంటారు. కానీ అలా తెరపైకి వచ్చే వందమంది కళాకారుల వెనుక తెరపైకి రాలేని కొన్నివేలమంది ప్రతిభావంతులైన కళాకారులు అజ్ఞాతంగా ఉండిపోతున్నారు.

కానీ, ఇంత ప్రతిభ ఉన్న ప్రసాద్ కూడా ఎంతో మందిలా అజ్ఞాతంగా ఉండిపోవటమన్న ఆలోచనను భరించలేకపోయాను.

'నేను మిమ్మల్ని వదలను' దృఢంగా అన్నాను.

'నన్ను విసిగించకండి' చిరాగ్గా అన్నాడు ప్రసాద్.

'మళ్లీ కలుస్తాను. త్వరలో కొత్త నాటిక వేద్దాం' మరోమాటకు తావివ్వకుండా వచ్చేశాను.

ప్రసాద్‌తో మళ్లీ నాటిక వేయించగలనన్న ఆత్మవిశ్వాసం నాకుంది. ఎందుకంటే నిజమైన కళాకారుడెప్పుడూ తన ప్రతిభను ప్రదర్శించే అవకాశాన్ని వదులుకోడు. అందుకే ప్రసాద్ నా నాటికలో నటించాడు. ప్రసాద్ మళ్లీ నటించాలంటే నేనీసారి క్రితం సారికన్నా అద్భుతంగా రాయాలి. రాయగలనన్న విశ్వాసం నాకుంది. అది చూస్తే ప్రసాద్‌లోని కళాకారుడు కాదనలేడు.

అంతలో మరో ఆలోచన వచ్చింది. ప్రసాద్‌లోని ప్రతిభను వెలికితేవాలన్న పట్టుదలతో నా రచనల్లో కూడా ఔన్నత్యం పెరుగుతుంది. నాలో కళాకారుడు కూడా ఉత్తమస్థాయికి చేరతాడు. పైగా ప్రేక్షకుల హర్షధ్వానాల మత్తును మళ్లీ అనుభవించాలని ఉంది.

అందుకే మళ్లీ కొత్త నాటకం రాయటం మొదలుపెట్టాను.

